## లోక్‌పాల్‌గా జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్!



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: తదుపరి లోక్‌పాల్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్ ఎంపికైనట్టు సమాచారం. ప్రధాని మోదీ, సీజేఐ డీవై చంద్రచూడ్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధిర్ రంజన్ చౌదరీలతో కూడిన ఉన్నతస్థాయి కమిటీ జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్ నియామకానికి బుధవారం ఆమోదం తెలిపినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. లోక్‌పాల్ అనేది అవినీతి నిరోధక అధికారం కలిగిన స్వతంత్ర న్యాయాధికార (అంబుడ్స్‌మన్) సంస్థ. కేంద్ర ప్రభుత్వ సంస్థలు, కేంద్ర ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులపై వచ్చే అవినీతి ఆరోపణల్ని విచారించే అధికారం లోక్‌పాల్‌కు ఉంటుంది. 2022 మే నుంచి లోక్‌పాల్ యాక్టింగ్ చైర్‌పర్సన్‌గా జార్ఖండ్ హైకోర్టు మాజీ సీజే ప్రదీప్ కుమార్ మొహంతి వ్యవహరిస్తున్నారు. 2022, జూలై 29న సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్ పదవీ విరమణ పొందారు. సుప్రీంకోర్టు జడ్జిగా ఖాన్విల్కర్ నేతృత్వంలోని ధర్మాసనాలు.. పలు కీలక కేసుల్లో తీర్పులు వెలువరించాయి. 2002 నాటి గుజరాత్ అల్లర్ల కేసులో ప్రధాని మోదీకి క్లిన్ చిట్ ఇచ్చారు. మరో రెండు రోజుల్లో రిటైర్ అవుతారనగా..'పీఎంఎల్‌ఏ' చట్టంలోని కఠిన నిబంధనల్ని జస్టిస్ ఖాన్విల్కర్ ధర్మాసనం సమర్థించింది.


## టోఫెల్ విద్యార్థులకు ఏఐ టిప్స్!

న్యూఢిల్లీ: టోఫెల్ విద్యార్థుల అదనపు సాధన కోసం కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత 'టోఫెల్ టెస్ట్ రెడీ' ప్లాట్‌ఫామ్‌ను ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీస్ (ఈటీఎస్) అందుబాటులోకి తీసుకొచ్చింది. విద్యార్థుల వ్యక్తిగత సాధనకు ఇది దోహదపడుతుందని, టిప్స్ రూపంలో సలహాలు, సూచనలు కూడా చేస్తుందని గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఫ్రీ, పెయిడ్ ఆఫర్లను ఉపయోగించుకొని 'టోఫెల్ టెస్ట్ రెడీ'లో సాధన చేయవచ్చు. 'ఏఐ ఆధారిత టెస్ట్ రెడీ విలక్షణ వేదిక. వ్యక్తిగత సాధనలో మెరుగులు దిద్దుకోవడానికి ఇదెంతగానో సహాయకారిగా నిలుస్తుంది' అని ఈటీఎస్‌కు చెందిన రోహిత్ శర్మ చెప్పారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ '40% కమీషన్'

**మునుపటి బీజేపీ సర్కారును మించి అవినీతి**

**కర్ణాటక సర్కారుపై కాంట్రాక్టర్ల సంఘం ఆరోపణలు**




*బెంగళూరు, ఫిబ్రవరి 8: కర్ణాటకలో ప్రభుత్వాలు మారినా అవినీతి, కమీషన్ల పర్వానికి మాత్రం అడ్డుకట్ట పడటం లేదు. '40% కమీషన్ రాజ్'గా మునుపటి బీజేపీ సర్కారుపై ముద్రపడిన విషయం తెలిసిందే. దీంతో గత ఎన్నికల్లో బీజేపీని గద్దె దింపి కాంగ్రెస్‌కు ప్రజలు అధికారం కట్టబెట్టారు. అయితే హస్తం పార్టీ అధికార పగ్గాలు చేపట్టి ఏడాది కూడా కాకమునుపే ఆ పార్టీపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బీజేపీ సర్కారును మించి కాంగ్రెస్ హయాంలో అవినీతి పెచ్చరిల్లిపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కర్ణాటక రాష్ట్ర కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డీ కెంపెన్న తాజాగా చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. '40 శాతం కమీషన్'.. కాంగ్రెస్ సర్కారులోనూ కొనసాగుతున్నదని గురువారం ఆయన సంచలన ఆరోపణలు చేశారు. మునుపటి బీజేపీ సర్కారులో ప్రజాప్రతినిధులే కమీషన్లు డిమాండ్ చేసేవారని, ఇప్పుడు అధికారులు కూడా డిమాండ్ చేస్తున్నారని మండిపడ్డారు.*

**అన్ని శాఖల్లో 'ప్యాకేజ్ సిస్టమ్'**

*'కర్ణాటకలో అధికారులు అవినీతికి పాల్పడుతున్నారు. ఇప్పటివరకు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు మమ్మల్ని కమీషన్లు అడిగేవారు. కాంట్రాక్ట్ పని కావాలంటే నిర్దిష్ట మొత్తం చెల్లించాలని డిమాండ్ చేసేవారు. ఇప్పుడు పరిస్థితి అలా లేదు. అధికారులు కూడా కమీషన్లు డిమాండ్ చేస్తున్నారు. కాంట్రాక్ట్ కావాలంటే, ముడుపులు ఇవ్వాల్సిందేనని చెప్తున్నారు' అని కెంపెన్న ఆరోపించారు. అధికారుల పేర్లు వెల్లడించాలని విలేకర్లు అడగ్గా.. తనపై ఇప్పటికే 5 పరువునష్టం కేసులు ఉన్నాయని, ప్రస్తుతానికి అధికారుల పేర్లు వెల్లడించడం లేదని చెప్పారు. 'అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ లంచగొండి అధికారులు ఉన్నారు. కొంత మంది మరీ దారుణం. బృహత్ బెంగళూరు మహానగర పాలికె అయినా, ప్రజాపనుల విభాగమైనా, నీటి పారుదల శాఖ అయినా.. అన్నిట్లోనూ అవినీతి అధికారులు ఉన్నారు. అధికారుల్లో అహంకారం పెరిగిపోయింది. దానికి వ్యతిరేకంగా మేం పోరాడుతున్నాం' అని పేర్కొన్నారు. ఎంత కమీషన్ అడుగుతున్నారని ప్రశ్నించగా.. 40 శాతం కమీషన్ కొనసాగుతున్నదని సమాధానమిచ్చారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ప్యాకేజ్ సిస్టమ్ కొనసాగుతున్నదని ఆరోపించారు. స్థానిక కాంట్రాక్టర్లను కాదని, పొరుగు రాష్ట్రాల కాంట్రాక్టర్లకు మేలు చేసేందుకే ఇలా చేస్తున్నారని, దీని వల్ల రాష్ట్రానికి చెందిన చిన్న, మధ్య స్థాయి కాంట్రాక్టర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మునుపటి బీజేపీ హయాంలో కమీషన్లకు వ్యతిరేకంగా కాంట్రాక్టర్లు పెద్ద ఎత్తున నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. కొందరు కాంట్రాక్టర్లు ఆత్మహత్యకు సైతం పాల్పడ్డారు. గత ఎన్నికల్లో ఇది ప్రధాన ప్రచార అస్త్రంగా మారింది. అవినీతిని అడ్డుకుంటామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అయితే బీజేపీని మించి కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి కొనసాగుతున్నదని కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.*

## వాట్సాప్‌లో 'థర్డ్‌పార్టీ చాట్'!

**ఇతర మెసేజ్ యాప్ యూజర్లకు సందేశాలు పంపే అవకాశం**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: టెలిగ్రామ్, సిగ్నల్, స్నాప్.. ఇతర యాప్ యూజర్లకు సందేశాల్ని పంపేందుకు 'థర్డ్ పార్టీ ఛాట్' సెక్షన్.. తీసుకొస్తున్నామని వాట్సాప్ మాతృసంస్థ 'మెటా' తాజాగా వెల్లడించింది. వాట్సాప్ ఖాతాదారులు తమ సందేశాల్ని... ఇతర యాప్‌ల్లోని యూజర్లకు పంపేందుకు క్రాస్ ప్లాట్‌ఫామ్ మెసేజింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నట్టు తెలిపింది. తొలుత దీనిని ఈయూ నిబంధనల ప్రకారం యూరప్ దేశాల్లో తీసుకొస్తారని సమాచారం. ప్రపంచవ్యాప్తంగా ఎప్పుడన్నది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. కొత్త కాన్సెప్ట్‌పై మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని వాట్సాప్ ఇంజినీర్ డిక్ బ్రౌజర్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అయితే టెలిగ్రామ్, సిగ్నల్, స్నాప్, గూగుల్, ఐమెసేజ్ (యాపిల్).. మొదలైనవి వాట్సాప్‌తో చేతులు కలుపుతాయా? లేదా? అన్నది తెలియాల్సి ఉంది. యూజర్ల ప్రైవసీ, భద్రత నేపథ్యంలో కొత్త కాన్సెప్ట్‌పై కంపెనీల మధ్య పలు ఒప్పందాలు కుదరాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

## యూరప్ ట్రిప్.. మరింత భారం!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: హాలీడేస్ కోసం కుటుంబంతో యూరప్ ట్రిప్ ప్లాన్ చేస్తున్నారా? అయితే, బడ్జెట్‌ను మరోసారి సరిచూసుకోండి. ఎందుకంటే 90 రోజుల ట్రిప్ (పర్యాటక వీసా) చార్జీలను పెంచాలని యూరప్ ప్రతిపాదించింది. ఇది కుటుంబం టూర్‌పై ఆర్థికభారం పెంచనున్నది. ప్రతిపాదించిన సవరణ ప్రకారం.. పెద్దలకు గతంలో చార్జీలు 80 యూరోలు ఉండగా ఇప్పుడు 90కి, చిన్నారులకు 40 యూరోలుగా ఉండగా ప్రస్తుతం 45 యూరోలకు పెరుగుతాయి. ఇండియా, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, చైనా దేశాల వారికి వీసా పెంపు భారం పడనున్నది.

## ఇన్సాట్-3డీఎస్ ప్రయోగం 17న

బెంగళూరు, ఫిబ్రవరి 8: వాతావరణ పరిశోధన కోసం ఇన్సాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని ఈ నెల 17న ప్రయోగించనున్నట్టు ఇస్రో గురువారం వెల్లడించింది. జీఎస్‌ఎల్‌వీ ఎఫ్14 వ్యోమనౌక ద్వారా దీన్ని నింగిలోకి పంపనున్నట్టు తెలిపింది. ఈ ప్రయోగం విజయవంతమైతే వాతావరణ పరిశీలన పెరిగి మెరుగైన వాతావరణ సూచనలను ప్రజలకు అందించే అవకాశం ఉంటుందని వివరించింది. ఈ ఉపగ్రహం ద్వారా భూమి, సముద్రాల ఉపరితలాలను పర్యవేక్షించడం ద్వారా విపత్తు హెచ్చరికలను కూడా జారీ చేయవచ్చని చెప్పింది.

## భారత్-మయన్మార్ మధ్య స్వేచ్ఛాయుత రాకపోకలు బంద్

న్యూఢిల్లీ: మయన్మార్‌లోని సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న 'స్వేచ్ఛాయుత రాకపోకల విధానం' (ఎఫ్ఆర్ఎం) రద్దు చేయాలని నిర్ణయించింది. ఇటీవలి కాలంలో మయన్మార్ నుంచి వేలాదిమంది సైనికులు భారత్‌లోకి ప్రవేశించడం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దేశ అంతర్గత రక్షణ, ఈశాన్య రాష్ట్రాల భౌగోళిక నిర్మాణాన్ని దృష్టిలో పెట్టుకుని ఎఫ్ఆర్ఎంను రద్దు చేయాలని నిర్ణయించినట్టు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా గురువారం ప్రకటించారు. స్వేచ్ఛాయుత రాకపోకల విధానంలో భాగంగా భారత్-మయన్మార్ సరిహద్దు నుంచి 16 కిలోమీటర్ల వరకు ఎలాంటి పత్రాలు లేకుండా రాకపోకలు సాగించవచ్చు. మయన్మార్‌తో సరిహద్దులు పంచుకుంటున్న రాష్ట్రాల్లో ఎఫ్ఎంఆర్ అమల్లో ఉంది.

## షరీఫ్ పార్టీకి ఇమ్రాన్ మద్దతుదారుల గట్టిపోటీ

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో జరుగుతున్న ఎన్నికల్లో మూడుసార్లు పాక్ ప్రధానిగా పనిచేసిన నవాజ్‌షరీఫ్ పార్టీ అభ్యర్థులు గట్టిపోటీని ఎదుర్కొన్నారు. మరీ ముఖ్యంగా కీలకమైన పంజాబ్ ప్రావిన్స్‌లో మరో మాజీ ప్రధాని, మాజీ క్రికెటర్ ఇమ్రాన్‌ఖాన్ మద్దతుదారులైన స్వతంత్ర అభ్యర్థులు షరీఫ్ పార్టీ అభ్యర్థులకు చుక్కలు చూపించారు. పాకిస్థాన్ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఇమ్రాన్ ఖాన్ తన పార్టీ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్‌కు అంతర్గత ఎన్నికలు నిర్వహించని కారణంగా పార్టీ సింబలైన బ్యాట్ గుర్తును కోల్పోయారు. చెదురుముదురు హింసాత్మక ఘటనలతో పాకిస్థాన్‌లో గురువారం ఎన్నికలు ముగిశాయి.

## సైనికుల స్థానంలో సాంకేతిక నిపుణులు

**మాల్దీవుల్లో సిబ్బంది మార్పుపై కేంద్రం ప్రకటన**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: మాల్దీవుల్లో భారత సైనికుల స్థానంలో సమర్థులైన సాంకేతిక సిబ్బందిని ఉంచుతామని భారత్ వెల్లడించింది. మాల్దీవులతో రెండో ఉన్నత స్థాయి సమావేశం జరిగిన కొన్ని రోజుల తర్వాత గురువారం ఈ విషయాన్ని తెలిపింది. అయితే సాంకేతిక సిబ్బంది ఏ బాధ్యతలు నిర్వహిస్తారు తదితర వివరాలు వెల్లడించడానికి నిరాకరించింది. వాస్తవానికి మాల్దీవులకు భారత బడ్జెట్లో నిధులు పెరిగాయని.. అయితే వాటిని సవరించాల్సి ఉందని.. ఆ తర్వాతే స్పష్టమైన సంఖ్య తెలియజేస్తామని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ వెల్లడించారు. 'ఇప్పటికీ మేం మాల్దీవులకు ముఖ్యమైన అభివృద్ధి భాగస్వామ్యులం. ఆ విషయానికి కట్టుబడి ఉన్నాం' అని జైశ్వాల్ భరోసా ఇచ్చారు. గతవారం న్యూఢిల్లీలో ఇరు దేశాల మధ్య సమావేశం జరిగిన తర్వాత తమ దేశంలోని మూడు విమాన వేదికల్లో ఒక దానిలో మార్చి 10లోగా, మిగతా వాటిలో మే 10లోగా భారత్ తన సైనికులను వేరే వారితో భర్తీ చేయడానికి అంగీకరించిందని మాల్దీవుల ప్రభుత్వం వెల్లడించింది.

## మేం కాదు.. మీరే

**కెనడా ఎన్నికల జోక్యం ఆరోపణలను ఖండించిన భారత్**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: తమ దేశ ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకొందన్న కెనడా ఆరోపణలు నిరాధారమంటూ కేంద్రం గురువారం వాటిని ఖండించింది. ఇతర దేశాల ప్రజాస్వామ్య ప్రక్రియల్లో జోక్యం చేసుకోవడం భారత్ విధానం కాదని తెలిపింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ గురువారం మీడియాకు ఈ విషయాలు తెలియజేశారు. 'కెనడానే భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నది. ఈ విషయాన్ని తరచూ మేం వాళ్ల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం' అని ఆయన తెలిపారు. కెనడా వ్యవహారాల్లో విదేశాల జోక్యంపై గతేడాది సెప్టెంబర్‌లో కెనడా ప్రధాని స్వతంత్ర కమిషన్ ఏర్పాటు చేశారు. ఆ కమిషన్ ఇచ్చిన సమాచారం ప్రకారం 2019, 2021 ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకొని ఉండొచ్చని తెలిపింది.

## 2024-25లో ఇస్రో 30 ప్రయోగాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ఈ ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం, 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇస్రో 30 ప్రాజెక్టులను చేపట్టనుంది. అంతరిక్ష రంగంలో ఇస్రో బలమైన విస్తరణకు ఈ ప్రాజెక్టులు తోడ్పడనున్నాయి. ఈ ప్రయోగాల్లో సగం అంతరిక్ష వాణిజ్య రంగానికి సంబంధించినవి. మిగతావి వాడకందారుల ప్రాయోజిత ప్రాజెక్టులు, శాస్త్ర పరిశోధనలు, సాంకేతికతను ప్రదర్శించే విమానాలకు చెందినవి.

## పరిమితి దాటిన ప్రపంచ ఉష్ణోగ్రతలు

**ఏడాది మొత్తం 1.5 డిగ్రీల సెల్సియస్ దాటడం ఇదే మొదటిసారి**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల సెల్సియస్ పరిమితి మించి నమోదయ్యాయని యూరోపియన్ క్లైమేట్ ఏజెన్సీ తాజాగా ప్రకటించింది. 2023 ఫిబ్రవరి-2024 జనవరి మధ్య 12 నెలల్లో ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 1.52 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైందని, పారిశ్రామిక యుగం (1850-1900) ముందు నాటితో పోల్చితే ఇది అత్యధికమని గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నది. అంతేగాక ఈ ఏడాది జనవరిలో ప్రపంచ సగటు ఉష్ణోగ్రత రికార్డ్‌స్థాయిలో 1.66గా నమోదైందని తెలిపింది. ఒక ఏడాది కాలంలో ఉష్ణోగ్రతలు ఈ విధంగా నమోదు కావటం ఇదే మొట్టమొదటిసారి అని ఆందోళన వ్యక్తం చేసింది.